క్లుప్తంగా

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) సేవా కార్యక్రమాల్లో భాగంగా కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ (నేవేలి బ్రాంచీ, తమిళనాడు) ఎ.క్రిష్ణయ్య శనివారం జిల్లా కేంద్రంలోని వీరన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వాటర్ ప్యూరిఫయ్యర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలకు రూ.50వేల విలువైన యంత్రాన్ని ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదవాలని సూచించారు. హెచ్‌ఎం గోపాల్, కౌన్సిలర్ చెన్న వీరయ్య పాల్గొన్నారు.

మండలాధ్యక్షుడిగా శశిధర్‌గౌడ్

అడ్డాకుల: మూసాపేట మండల సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం మండలాధ్యక్షుడిగా జానంపేటకు చెందిన శశిధర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయ్యప్ప గుట్టపై శనివారం మండల గౌరవ అధ్యక్షుడు రామన్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌గౌడ్(వేముల), అదనపు కార్యదర్శిగా గణేష్‌గౌడ్(కొమిరెడ్డిపల్లి), ఉపాధ్యక్షులుగా చంద్రయ్యగౌడ్(సంకలమద్ది), రాజేందర్‌గౌడ్(పోల్కంపల్లి), బుచ్చన్నగౌడ్(నందిపేట), కోశాధికారిగా శరత్‌గౌడ్(మూసాపేట) తదితరులను ఎన్నుకున్నారు.

భవిష్యత్ నిర్మించుకోవాలి

దేవరకద్ర రూరల్: చౌదర్‌పల్లి సమీపంలోని స్విట్స్ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు అవగాహన, ప్రేరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె. సంపత్ కుమార్ మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.సుధాకర్, జయంతి సొసైటీ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు బాలీశ్వర్, ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

జడ్చర్ల టౌన్: పట్టణంలో మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. మీరైనా మద్దతివ్వండి అంటూ కార్మికులు పట్టణ ప్రజలకు శనివారం మొరపెట్టుకున్నారు. ఇందిరాగాంధీ విగ్రహం కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు మహేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, కార్మికులు పాల్గొన్నారు.

కేసు నమోదు

మిడ్జిల్: మండల కేంద్రంలో వ్యాపార సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా 2, 4వ శనివారం బంద్ చేసుకోవాలని తీర్మాణం చేసుకున్నారు. కాగా అందుకు విరుద్ధంగా ఓ సూపర్ మార్కెట్ తెరవడంతో వ్యాపార సంఘం నాయకులు వెళ్లి ప్రశ్నించారు. ఈ క్రమం లో యజమాని అడ్డు చెప్పడానికి మీరు ఎవరూ అంటూ అడగడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ మేరకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఘటన తర్వాత యజమాని మరి కొందరు ఎన్‌హెచ్167లో ప్రజా రవాణాకు ఆటంకం కల్గించే విధంగా అనుమతి లేకుండా ధర్నా చేయడంతో మరో కేసునమోదు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి శివారులో ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి బొలెరో ఢీకొట్టడంతో వారు తీవ్రగాయపడ్డారు. శనివారం జాతీయ రహదారిపై ఘటన చోటుచేసుకుంది. రాయపల్లికి చెందిన ఉద్దేష్‌గౌడ్ అతడి భార్య మాధవి జడ్చర్ల నుంచి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మాధవికి తలకు, ముఖానికి.. ఉద్దేష్‌గౌడ్‌కు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. అదేవిధంగా ఉద్దేష్ చేతివేళ్లు విరిగినట్లు ఎస్వీఎస్ వైద్యులు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు ..

నవాబుపేట: కాకర్‌జాల్‌కి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ సిరాజ్ (49) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శనివారం అతడు జిల్లా కేంద్రానికి వెళ్లి ఇంటికి వస్తున్న తరుణంలో కాకర్లపహాడ్ సమీపంలోని పలుగుమర్రి దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో అతడు తీవ్రంగా గాయపడడంతో అక్కడున్నవారు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

కనీస వేతనాలు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలకు కనీస వేతనాలు అమలు చేయాల్సిందేనని డిమాండ్‌చేస్తూ ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని.. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పేర్కొన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని పేర్కొన్నారు.

వైద్య శిబిరం

నవాబుపేట: వృద్ధులకు ప్రత్యేకంగా హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రోగ్రాం అధికారి సురేష్‌నాయక్ తెలిపారు. శనివారం ఇప్పటూర్‌లో శిబిరం ప్రారంభించారు. శిబిరంలో 98 మంది వృద్ధులు చికిత్స చేయించుకున్నారు. డాక్టర్ వనజ, పంచాయతీ అధికారి కల్పన, మాజీ ఉపసర్పంచ్ రవికిరణ్, గణేష్, శివారెడ్డి ఉన్నారు.



జిల్లాకేంద్రంలోని భగీరథ కాలనీలో..



జిల్లాకేంద్రంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో..

గోకుల గోపాల కృష్ణా..

సాక్షినెట్ వర్క్: జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా వైభవంగా నిర్వహించారు.

■ మహబూబ్‌నగర్ భగీరథకాలనీలోని జూనియర్ చాంప్స్ స్కూల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ చౌరస్తాలోని శ్రీ చైతన్య స్కూల్‌లో వేడుకల్లో ఏజీఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని అపెక్స్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో డైరెక్టర్ రామారావు, ఏఓ నాగమణి పాల్గొన్నారు.

నవాబుపేటలోని పలు పాఠశాలల్లో చిన్ని కృష్ణుడి వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

■ డోకూర్ సమీపంలోని తపోవన్ పాఠశాలలో చిన్ని కృష్ణులు, ముద్దులొలికే గోపికమ్మల వేషధారణలో చిన్నారులు అలరించారు. ప్రిన్సిపాల్ నిరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రయ్య, నర్సిములు, అమిర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు. భూత్పూర్ పట్టణంలో పలు పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



నవాబుపేటలో..



దేవరకద్రలో..

రిషి పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి



రిషి పాఠశాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు


మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి పాఠశాలలో శనివారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. బాలబాలికలు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ప్రిన్సిపాల్ వందన మాట్లాడుతూ పండుగ సంస్కృతిలో భాగమని, భవిష్యత్తు తరాల వారికి దాని ప్రాధాన్యత తెలియాలంటే ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు, శోభ, లహరి, గీత, జ్యోతి, వందన తదితరులు పాల్గొన్నారు.



గోపిక, కృష్ణుల వేషధారణలో మౌంట్‌బాసిల్ హైస్కూల్ విద్యార్థులు

మౌంట్‌బాసిల్‌లో ఆకట్టుకున్న వేడుకలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రం సమీపంలోని మౌంట్‌బాసిల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు గోపిక, కృష్ణుల వేషధారణలో అలరించారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు, ఆటలు, పాటలు అలరించాయి. ముఖ్యంగా గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా.. మాయలు చాలయ్యా అంటూ చిన్నారులు చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్‌లు సుశాంత్ కృష్ణ, శిరీష ప్రవీణ్, పూజిత మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.





భూత్పూర్‌లో..

చెక్కుల పంపిణీ

మిడ్జిల్: మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. అలాగే 14 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.

తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మి

మిడ్జిల్: కుమారులు, కుమార్తెలు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ప్రేమ, ఆప్యాయతలతో.. బాధ్యతగా చూసుకోవాలని జడ్చర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మి సూచించారు. ప్రపంచ సీనియర్ సిటిజన్ డే పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా ఆర్థిక లావాదేవీలు, రైతులు ఎరువులు, విత్తనాలు భూములు అమ్మకాలు, కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాలిక్ షకీర్, సాహితిరెడ్డి, పురుషోత్తం, పాండుకుమార్, కార్యదర్శి సాయన్న పాల్గొన్నారు.

రుణమాఫీ లబ్ధిపొందని రైతుల వివరాల సేకరణ

దేవరకద్ర: మండల పరిధిలో ఇప్పటికీ రుణమాఫీ లబ్ధిపొందని రైతులు శనివారం మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేశారు. దేవరకద్ర రైతు వేదికలో వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ ఫిర్యాదులు తీసుకున్నారు. రైతుల వివరాలను సేకరించి వాటిని ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్‌తో వస్తే వెబ్‌సైట్‌లో చూసి రుణం ఎందుకు మాఫీ కాలేదో వివరిస్తామని ఆయన తెలిపారు. దేవరకద్ర వ్యవసాయ సహకార సంఘంలో 880 మంది రైతులు రుణాలు తీసుకుంటే అందులో 499 మంది రైతులకు రుణమాఫీ వచ్చిందని అధికారులు తెలిపారు. మరో 381 మంది రైతులకు రుణ మాఫీ కాలేదని వారి వివరాలను సేకరిస్తున్నట్లు వివరించారు. నాగారం వ్యవసాయ సహకార సంఘంలో 617 మంది రైతులు రుణాలు తీసుకోగా అందులో 419 మందికి రుణమాఫీ అయిందని, మిగతా 198 మందికి రుణమాఫీ కాలేదని తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

వ్యవసాయ అధికారిగా శివకుమార్

దేవరకద్ర: కొకుంట్ల మండల వ్యవసాయ అధికారిగా శివకుమార్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. కొత్తగా ఏర్పడిన కౌకుంట్ల మండలానికి ఇప్పటి వరకు దేవరకద్ర మండల వ్యవసాయ అధికారి ఇంచార్జీగా ఉన్నారు. కాగా శివకుమార్ మాట్లాడుతూ మండలంలో రైతులకు అందుబాటులో ఉంటామని.. వ్యవసాయానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని తెలిపారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ రైతు రుణమాఫీ అమలు చేయాలని.. తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్‌చేశారు. అదేవిధంగా ఉచిత విద్యుత్ విషయంలోనూ చర్యలు చేపట్టాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు రోజులుగా క్షేత్రస్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ప్రత్యేక బృందం పరిశీలిస్తోంది. 2020లో మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 31 వేల మంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో తాజాగా 125 మాత్రమే తనిఖీ చేశారు. మరోవైపు శనివారం షాషాబ్‌గుట్ట ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, డీఈఈ సందీప్ తదితరులు పరిశీలించారు. అక్కడి వాస్తవ పరిస్థితులను త్వరలోనే కలెక్టర్ విజయేంద్ర బోయికి నివేదించనున్నారు.



ఓపెన్ పాట్లను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

దేశాభివృద్ధిలో ఎల్‌ఐసీ భాగస్వామ్యం



స్టేషన్ మహబూబ్‌నగర్: దేశాభివృద్ధిలో ఎల్‌ఐసీ తనవంతు భాగస్వామ్యాన్ని కలిగి ఉందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ డివిజన్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం మహబూబ్‌నగర్ బ్రాంచీ 58వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించారు. హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు మద్దిలేటి, ఉపాధ్యక్షుడు వి.రాజేశ్వర్, జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, కోశాధికారి శ్రీనివాసన్, డివిజన్ కోశాధికారి యాదగిరిరావు పాల్గొన్నారు.

ఆలయంలో నీటి ఊట



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని జడలమైసమ్మ ఆలయంలో మూడు రోజులుగా నీటి ఊట వస్తుండటంతో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయంలోని మైసమ్మ పాదాల చెంత ఉబికివస్తున్న నీటి ఊట అక్కడితో ఆగిపోతున్నాయి. నీటిని తోడితే మళ్లీ పాదాల చెంతకు వచ్చి నిలుస్తున్నాయి. మూడు రోజులుగా కొన్ని వందల బకెట్ల నీరు తోడినట్లు కాలనీవాసులు తెలియజేస్తున్నారు. నీటిని తీసుకెళ్లి ఇళ్లల్లో చల్లుకొంటున్నారు. విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో భక్తులు ఆలయానికి క్యూ కట్టారు. కాగా ఆలయ నిర్వాహకురాలు చంద్రమ్మ మాట్లాడుతూ తానెప్పుడూ ఇలాంటి నీటి ఊట చూడలేదన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

రాజాపూర్: రైతులు వరి పంటను చీడపురుగుల నుంచి కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం తిరుమలాపూర్, దోండ్లపల్లి గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల నమోదు చేపట్టారు. తిరుమలాపూర్‌లో రైతు ఆగ్రో కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలపై ఎప్పటికప్పుడు బోర్డుపై నమోదు చేయాలని సూచనలు చేశారు.

రవి కుటుంబాన్ని ఆదుకుంటాం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన విద్యుత్‌శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మునగల రవి(27) కుటుంబాన్ని శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. రవి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ ద్వారా పరిహారం ఇప్పించే విధంగా కృషి చేస్తానని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకుంటామని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు తోట శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, భీమన్న యాదవ్, శరత్‌కుమార్‌రెడ్డి, వేఘనాథ్ ఉన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

రాజాపూర్: ఇసుక అక్రమ రవాణాపై రాజాపూర్ ఎస్ఐ రవి, సిబ్బంది కొరడా ఝుళిపిస్తున్నారు. శివారులో ఉన్న దుందుభీ వాగులో పెద్దపెద్ద గోతులు పెట్టి మట్టిని తోడేయడంతో పాటు అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు చేపడుతున్నారు. శనివారం తెల్లవారుజామున దుందుభీవాగులో ఏకకాలంలో దాడులు నిర్వహించి మూడు జేసీబీలు, నాలుగు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉంటే ఈ అక్రమ దందాను రాజాపూర్, ముదిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన కొందరు యువకులు అవకాశంగా తీసుకుని అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. కృత్రిమ ఇసుక లోడ్ చేసుకుని వస్తున్న అక్రమ వాహనాలకు అడ్డుగా నిల్చొని మామూళ్లు వసూలుచేస్తున్నారు. డబ్బులు చెల్లించని వారిపై సోషల్ మీడియాలో పెట్టడం, పోలీసులకు చెప్పడం చేస్తున్నారు. విషయంపై వివరణ కోరగా మండలంలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ రవి తెలిపారు. అదేవిధంగా వసూళ్లకు పాల్పడుతున్న యువతపై సైతం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గిరిజనులు

నవాబుపేట: కాకర్‌జాల్‌తండా సమీపంలోని పెరుమాళ్లగుట్ట ఆంజనేయస్వామికి శనివారం గిరిజనులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏటా శ్రావణమాసంలో సాంప్రదాయంగా పూజలు చేపడుతూ వస్తున్నారు. ఈ మేరకు శనివారం గుట్టపై స్వామివారి నామస్మరణ మార్మోగింది. భక్తిశ్రద్ధలతో ఊరేగింపు చేపట్టారు. సంతోష్‌నాయక్, గోపాల్‌నాయక్, బుద్ధునాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన



బొటానికల్ గార్డెన్‌లో బీట్ ఆఫీసర్ల బృందం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉన్న బొటానికల్ గార్డెన్‌ను శనివారం రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35మంది బీట్ ఆఫీసర్లు సందర్శించారు. గార్డెన్‌కు వచ్చిన బీట్ ఆఫీసర్ల బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య, వృక్షశాస్త్రవిభాగం అధిపతి డా.నర్మద స్వాగతం పలికారు. గార్డెన్‌లోని వివిధ విభాగాలను పరిశోధక విద్యార్థి రాహుల్ వారికి చూయించి అవగాహన కల్పించారు. బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఉన్న పాములను అక్కడ భద్రపర్చిన అతిపెద్ద పాము కుబుసాన్ని గురించి వారు తెలుసుకున్నారు. బీట్ ఆఫీసర్ల సమన్వయకర్త రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆర్‌యూబీలోకి వరదనీరు



ఆర్‌యూబీలో నిండిపోయిన వరద నీరు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద నిర్మిస్తున్న ఆర్‌యూబీలోకి వరదనీరు వచ్చి చేరింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు వచ్చి చేరటంతో పనులకు ఆటంకంగా మారింది. దీంతో మోటార్ల సాయంతో నీటిని బయటకు తోడేస్తున్నారు. ఆర్‌యూబీలోకి వరదనీరు చేరితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గానూ పెద్ద కాల్వ నిర్మిస్తున్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

జడ్చర్ల: ఆస్పత్రి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని.. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. సూపరింటెండెంట్ చంద్రకళకు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కృష్ణయాదవ్, కార్మికులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులపై ఆరా

గండేడ్: వెన్నాచేడ్ ఎస్సీ హాస్టల్‌ను ఎంపీడీఓ దేవన్న, ఆయన బృందం శనివారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వసతులపై అధికారులు ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. కాగా వార్డెన్ మోహన్‌రెడ్డి వర్షాకాలం వస్తే గదులు కురుస్తున్నాయని వివరించారు. గతంలోనూ ఉన్నతాధికార్ల దృష్టికి తీసుకెళ్లామని వారికి వివరించారు. గతంలో కరెంటు వైరింగ్ సరిగ్గా లేకపోవడంతో బోరు స్టార్టర్‌కు నిప్పంటుకుని కాలిపోయిందని పేర్కొన్నారు. దాని స్థానంలో కొత్తగా వైరింగ్ చేయాలన్నారు. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపోయినంతగా లేవని వివరించారు.

పాఠాలు బోధించిన ఎంపీడీఓ

నవాబుపేట: మండల పరిధిలోని చెన్నరెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి, కారూర్ పాఠశాలలను ఎంపీడీఓ జయరాంనాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెన్నరెడ్డిపల్లిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులు పారిశుద్ధ్యంపై తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవటంతో పాటు డ్రైడే పాటించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.